సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెనపై నుంచి గణనాథుడి నిమజ్జనం



కాళేశ్వరాలయం వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

బైబై..గణేశా!

గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు



- నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు
- భారీ బందోబస్తుతో నిమజ్జనం
- వందల సంఖ్యలో తరలివచ్చిన గణనాథుల ప్రతిమలు, భక్తులు

కాళేశ్వరం: తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న వినాయకుడిని భక్తులు శుక్రవారం గోదావరిలో నిమజ్జనం చేసి వీడ్కోలు పలికారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరిలో వరంగల్ ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి వినాయక విగ్రహాల రథాలు భారీగా తరలి వచ్చాయి. పల్లెలు, పట్టణాల్లో వినాయక మండపాల్లోని కమిటీ సభ్యులు గల్లీగల్లీకి వినాయక విగ్రహాలకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, భజన, భక్తిసంకీర్తనలతో పూజించారు. వినాయకునికి ఇష్టమైన పిండి వంటలు, పండ్లు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అంగరంగ వైభవంగా మంగళ వాయిద్యాలతో నృత్యాలు, మహిళలు కోలాటం ప్రదర్శనలు, యువత తీన్మార్ డాన్స్‌లతో గణేష్ మహరాజ్‌కీ జై.. గణపతిబప్పా మోరియా, బైబై గణేష్ అంటూ నినాదాలు పలుకుతూ గంగమ్మ ఒడికి సాగనంపారు.

నిమజ్జనం వద్ద అధికారులు..

ఇబ్బందులు కలుగకుండా అంతర్రాష్ట్ర వంతెన వద్ద జిల్లా అధికారులు పర్యవేక్షించారు. కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, డీపీఓ వీరభద్రయ్య, తహసీల్దార్ రామారావు, ఎంపీఓ ప్రసాద్, కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య ఏర్పాట్లు, ఇతర ఏర్పాట్లు చేశారు. కాళేశ్వరం వైద్యాధికారి సుస్మిత వైద్యసేవలు అందించారు. ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మల్సూర్, డీఈఈ పాపిరెడ్డి, నాగరాజు, శ్రీకాంత్, సదానందం అధికారులు విద్యుత్ సరఫరాను అంతరాయం లేకుండా అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి, నాయకులు మెంగాని అశోక్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.

నిమజ్జనం ఇలా..

కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద రెండు చోట్ల ఏర్పాటు చేసిన రెండు స్టాండ్‌లకు రెండేసి క్రేన్‌లతో విగ్రహాలను ఎత్తి విగ్రహాలను స్టాండ్‌లపై నుంచి గజఈతగాళ్ల సహాయంతో గోదావరి నీటిలోకి వదిలి నిమజ్జనం చేశారు. అర్ధరాత్రి వరకు నిమజ్జనం కొనసాగింది.

కాళేశ్వరం దేవస్థానంలో..

కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపు చేసి భక్తిభజనలు, మంగళహారతులతో నిమజ్జనానికి తీసుకెళ్లారు. భక్తులు త్రివేణి సంగమ గోదావరిలో నిమజ్జనం చేశారు. దేవస్థానం ఈఓ మహేష్, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలించిన కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మట్టి వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కలెక్టర్ రాహుల్ శర్మ నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలను భక్తులు, యంత్రాంగపు సలహాలు, సూచనలు పాటిస్తూ దిగ్విజయంగా జరుపుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు ప్రదీప్, సంగీత్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల బందోబస్తు..

జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, పట్టణాల నుంచి భారీగా విగ్రహాలు తరలిరావడంతో ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును పటిష్టంగా నిర్వహించారు. సుమారుగా 250మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. నిమజ్జనం బందోబస్తును కాటారం డీఎస్పీ సూర్యానారాయణ, సీఐ ఎన్.వెంకటేశ్వర్లు, నాగార్జున రావు, ఎస్సైలు తమాషారెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్, రమేష్‌లతో పాటు పలువురు పర్యవేక్షించారు. ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణం బంద్ చేసి మందు విక్రయాలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

- మరిన్ని ఫొటోలు 9లో ▸

రద్దీగా జిల్లాకేంద్రం

భూపాలపల్లి అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు జిల్లాలోని నలుమూలల నుంచి వినాయక విగ్రహాలను ఎక్కువ సంఖ్యలో కాళేశ్వరంలోని గోదావరి నదిలో నిమజ్జనం చేసేందుకు భూపాలపల్లి పట్టణం మీదుగా తరలించారు. దీంతో జిల్లా కేంద్రం రద్దీగా మారింది. కాళేశ్వరంతో పాటు లక్నవరం, ఏటూరునాగారం ఇతర ప్రదేశాలకు విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ తరలించారు. భూపాలపల్లి పట్టణంలోని పలు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సైతం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో నిమజ్జనం చేసేందుకు తరలించారు. యువకులు, మహిళలు ప్రత్యేక దుస్తులు ధరించి నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. కాలనీల నుంచి వచ్చే వినాయక మండలికి చెందిన వినాయక విగ్రహాల ఎదుట మహిళలు కోలాటం ఆడుతూ.. సాంప్రదాయ బద్ధంగా మంగళహారులతో గణపయ్యను గంగమ్మ చెంతకు సాగనంపారు. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా డీఎస్పీ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు చేయగా ఎస్పీ కిరణ్‌ఖరే పరిశీలించారు.

నిర్వాహకులకు సన్మానాలు

నిమజ్జనానికి కాళేశ్వరం తరలివెళ్లే వినాయక విగ్రహాల నిర్వాహకులకు, కమిటీ సభ్యులకు అంబేడ్కర్ సెంటర్‌లో ధర్మవాహిని గణేష్ ఉత్సవ కమిటీ, గణేష్‌చౌక్‌లో ధర్మజాగరణ గణేష్ ఉత్సవ సమితిల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమాలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, నిర్వాహకులు దేవన్, రమేష్, అనిల్, వెంకన్న, రవీందర్, ప్రభాకర్, భిక్షపతి, యుగేందర్, రవీందర్, మధుసూదన్, రాజేందర్, సంజీవరావు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో కోలాటం ఆడుతున్న మహిళలు, యువతీ యువకులు



వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ



హరితహోటల్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడిని..



కాళేశ్వరంలో చిన్నారుల చిందులు



వంతెన పైనుంచి నిమజ్జనం చేస్తున్న గణనాథుడి విగ్రహం

న్యూస్‌రీల్

హైదరాబాద్ వెళ్లిన జీపీఓలు



భూపాలపల్లి: జిల్లా నుంచి ఎంపికైన 107 మంది గ్రామ పాలన అధికారులు(జీపీఓ)లు శుక్రవారం హైదరాబాద్ తరలివెళ్లారు. రాష్ట్ర రాజధానిలోని హైటెక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకునేందుకు వెళ్లగా జిల్లా అధికారులు వారికి రెండు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ నుంచి బయలుదేరిన వారికి అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ శుభాకాంక్షలు తెలియజేసి పంపించారు.

సీఎం, మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



భూపాలపల్లి అర్బన్: భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ పథకాలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ భవన నిర్మాణ రంగ కార్మికుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు ఇస్తారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇటుకలు రమేష్, ఎంజాల రమేష్, కూనారపు కుమార్, కుంచాల సుబ్బారావు, శంకర్ పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



భూపాలపల్లి రూరల్: జీఎస్టీని తగ్గించడాన్ని హర్షిస్తూ ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ శ్రేణులు జిల్లా కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్ పేద మధ్య తరగతి ప్రజల అభివృద్ధికి జీఎస్టీ పన్ను తగ్గింపు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అర్బన్ ప్రధాన కార్యదర్శులు మనోహర్ రెడ్డి, జోరు కృష్ణ, నాయకులు బట్టు రవి, కంబాల రాజయ్య, ఉనుకొండ రామకృష్ణ, ఊరటి మునేందర్, పొన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు. కొంపల్లిలోనూ బీజేపీ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

వానగుట్ట ప్రాంతంలోనే పులి మకాం





వెంకటాపురం(ఎం): ములుగు జిల్లాలో మూడు రోజులుగా సంచరిస్తున్న పులి శుక్రవారం సాయంత్రం వరకు వెంకటాపురం(ఎం) మండలంలోని వానగుట్ట అటవీ ప్రాంతంలోనే ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. బుధవారం ములుగు మండలంలోని పత్తిపల్లి, పోట్లాపూర్ సమీప అడవుల్లో సంచరించిన పులి.. గట్టమ్మ మీదుగా గురువారం వెంకటాపురం(ఎం) మండలంలోకి ప్రవేశించింది. శుక్రవారం ఉదయం సింగరకుంటపల్లె రోడ్డు దాటుతూ వానగుట్ట వైపు వెళ్లినట్లు తెలిసింది. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా ములుగు ఎఫ్ఆర్ఓ శంకర్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది పులి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వానగుట్ట సమీపంలో పులి పాదముద్రలను గుర్తించినట్లు ఎఫ్ఆర్ఓ శంకర్ తెలిపారు. పులి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

శిల్పకళా వేదికలో కేయూ స్టాల్

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవంలో కాకతీయ యూనివర్సిటీ సెరికల్చరల్ విభాగం ఆధ్వర్యంలో 'వేస్టు టు వెల్త్'పై స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాతను ఆ స్టాల్ ఎగ్జిబిట్ గురించి అడిగి తెలుసుకున్నారు.

యూరియా ఇబ్బందులు తీర్చాలి



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: రైతుల యూరియా ఇబ్బందులు తీర్చాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అసమర్థతతోనే యూరియా కొరత ఏర్పడిందని విమర్శించారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణను నిలిపేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, నాయకులు కోడారి రమేష్, జోరుక సదయ్య, నెనకంటి ప్రభాకర్‌రెడ్డి, పెంతల రాజేందర్, రాములు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

యూరియా కోసం అన్నదాతల ధర్నా



ఆందోళన చేస్తున్న రైతులు

కాటారం: మన గ్రోమోర్‌లో నిల్వ ఉన్న యూరియా పంపిణీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో మన గ్రోమోర్ ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మన గ్రోమోర్‌లో యూరియా నిల్వ ఉన్నా పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. స్టాక్‌కు సంబంధించి డీఓ ఆర్డర్ రాలేదనే సాకుతో యూరియా ఇవ్వలేరని అన్నారు. యూరియా లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి సముదాయించారు. ఏఓ పూర్ణిమ, మన గ్రోమోర్ మేనేజర్‌తో మాట్లాడి రైతులకు యూరియా పంపిణీ చేయాలని సూచించడంతో అందజేశారు.

నిమజ్జనాన్ని రాత్రి పరిశీలించిన ఎస్పీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెనపై గణనాథుల నిమజ్జనాన్ని ఎస్పీ కిరణ్‌ఖరే, సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై తమాషారెడ్డిలతో కలిసి శుక్రవారం రాత్రి పరిశీలించారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద బందోబస్తు, నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించారు.



గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి



ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జీఎం రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్: విఘ్నాలను తొలగించే ఆదిదేవుడు గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గణపతి నవరాత్రుల్లో భాగంగా భూపాలపల్లి మంజూర్‌నగర్‌లోని పాత కలెక్టరేట్ ప్రాంగణంలోని శ్రీ లలితా త్రిపుర సుందరిదేవీ ఆలయంలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులను అందించాలని విఘ్నేశుడిని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, ఉన్నారు.

దగ్ధమైన ఇల్లు పరిశీలన

భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని మహబూబ్‌పల్లిలో ప్రమాదవశాత్తు దగ్ధమైన కొమ్ము ప్రమీలకు సంబంధించిన ఇల్లును ఎమ్మెల్యే సత్యనారాయణరావు పరిశీలించారు.

అడవుల్లో ఆహ్లాదం



తూము కోసం నిర్మించిన వంతెన

పర్యాటక కేంద్రంగా బొగ్గులవాగు

మల్హర్: చుట్టూ దట్టమైన అడవి.. ప్రశాంత వాతావరణం..మనసును ఆహ్లాదపరిచే పచ్చదనంతో ఎంతో హాయిగా ఉంటుంది బొగ్గులవాగు ప్రాజెక్టు ప్రాంతం. 41 సంవత్సరాల క్రితం అడవి మధ్యలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంజనీర్లు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. కిలోమీటర్ల మేర అడవిలో ప్రయాణం చేసిన అనంతరం అక్కడ కనిపించే నీరు మనుసుకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. మండలంలోని ఎడ్లపల్లి, రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని భారీ మధ్యతరహా బొగ్గుల వాగు ప్రాజెక్టుతో 5వేల పైచిలుకు ఎకరాల భూమి సాగవుతుంది. పది గ్రామాలకు సాగు నీటిని అందిస్తూ మండలానికి తలమానికంగా మారింది.

ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణ

ఎడ్లపల్లి గ్రామం నుంచి బొగ్గుల వాగు ప్రాజెక్టుకు మూడు కిలో మీటర్ల పాటు రోడ్డు మార్గం ఉంది. రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద చెట్లు దారి మధ్యలో మోత్కుపల్లి పోశమ్మ దేవాలయం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. సమీప గ్రామాల ప్రజలు ఈ ఆలయంలో పూజలు చేసి మేకలు, కోళ్లు బలిచ్చి బొగ్గుల వాగు పరిసర ప్రాంతంలో విందు భోజనాలు చేస్తారు. నీటి మధ్యలో ఎండిపోయిన నార వేప చెట్టు చూపరులను ఆకట్టుకుంటుంది. మత్తడి ప్రదేశంలో ఉండే పెద్ద పెద్ద రాళ్లు, వాటి మధ్యలో ఉండే చేపలు, వాటర్‌ఫాల్స్ చూపరులను ఆకట్టుకుంటాయి.



బొగ్గుల వాగు ప్రాజెక్టు మత్తడి

బ్యాలెన్సింగ్ తప్పిన క్రేన్

- భయాందోళనకు గురైన మేయర్, కలెక్టర్, కమిషనర్



చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద బ్యాలెన్సింగ్ తప్పడంతో భయాందోళనకు గురైన మేయర్, కలెక్టర్, కమిషనర్, కార్పొరేటర్లు, అధికారులు

వరంగల్ అర్బన్ : గణపతి నిమజ్జనం సందర్భంగా వరంగల్ నగరంలోని ఓ చెరువు వద్ద క్రేన్ బ్యాలెన్సింగ్ తప్పడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం వరంగల్ చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద వినాయకుల నిమజ్జనాన్ని ప్రారంభించేందుకు మేయర్ గుండు సుధారాణి, వరంగల్ కలెక్టర్ సత్యశారద, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఏసీపీ శుభం, డీసీపీ సలీమా, కార్పొరేటర్లు, అధికారులు సుమారు 24 మంది వరకు క్రేన్‌లోకి ఎక్కారు. క్రేన్ మొరాయించడంతో కొంత మంది అధికారులను సిబ్బంది దించారు. అనంతరం వినాయక ప్రతిమలతో చెరువులో తెప్పమీదికి దిగారు. మేయర్, కలెక్టర్లు కొబ్బరికాయ కొట్టి నిమజ్జనాన్ని ప్రారంభించారు. తిరిగి క్రేన్‌లోకి వీరితోపాటు గజ ఈతగాళ్లు మొత్తం 17 మంది వరకు ఎక్కారు. క్రేన్ కొద్ది మేరకు పైకి వెళ్లిన తర్వాత బ్యాలెన్సింగ్ తప్పి ఊగింది. దీంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ మళ్లీ క్రేన్‌ను తెప్ప మీదికి తీసుకొచ్చి, కొంతమందిని దించారు. తదుపరి వీరిని ఒడ్డుకు చేర్చడంతో ఊపిరి పీల్చుకున్నారు. సేఫ్టీ లైఫ్ జాకెట్లు లేకుండా చెరువులో నిమజ్జనానికి ఆయా శాఖల అధికారులు అనుమతి ఎలా ఇస్తారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఆ నలుగురు లేక..

ఆగస్టు 28వ తేదీన మరిపెడకు చెందిన భద్రయ్య వైద్యం కోసం ఎంజీఎం ఆస్పత్రిలో చేరాడు. రెండ్రోజుల అనంతరం చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడి కోసం ఎవరైనా వస్తారేమోనని వారంపాటు మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఎవరూ రాకపోవడంతో స్వచ్ఛంద సంస్థ సహాయంతో అంత్యక్రియలు చేశారు.

కాజీపేట రైల్వే జంక్షన్ సమీపంలో ఇటీవల ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని పత్రిక ప్రకటన విడుదల చేసి మూడ్రోజులు శవాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఎవరూ రాకపోవడంతో స్వచ్ఛంద సంస్థ సహాయంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఇలా అనేక మంది వృద్ధులకు వృద్ధాశ్రమాల నిర్వాహకులే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

- అయినవారితో అంత్యక్రియలకు నోచని అనాథలు
- పోలీసులు, అనాథాశ్రమ నిర్వాహకులకు భారం

కాజీపేట : 'మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు.. మచ్చుకైనా లేడు మానవత్వం ఉన్నవాడు 'అంటూ ఓ సినీకవి అన్నట్లు వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు సేవ చేయలేక కొందరు, మంచాన పడితే సపర్యలు చేయాల్సి వస్తోందని మరికొందరు, అంత్యక్రియల ఖర్చు భరించలేక ఇంకొందరు.. కారణం ఏదైనా కన్నపేగుకు చివరి మజిలీ చేయకుండా వదిలించుకుంటున్నారు. ఆస్పత్రులు, రోడ్ల వెంట, ఆశ్రమాల్లో అనాథ శవాలుగా మారడంతో స్వచ్ఛంద సంస్థలు అంత్యక్రియలు నిర్వహిస్తున్నాయి.

వైద్యంపేరుతో వదిలించుకుంటున్నారు

దీర్ఘకాల వ్యాధులు, వృద్ధాప్యంతో బాధపడేవారిని ప్రాంతీయ, జిల్లా ఆస్పత్రులకు తీసుకొచ్చే క్రమంలో కొందరు వివరాలు నమోదు చేయకుండానే వార్డుల్లో చేర్చి వెళ్లిపోతున్నారు. సపర్యలు చేసేవారు లేక మల,మూత్ర విసర్జనలు మంచంలోనే చేస్తుండటంతో ఇతర రోగులకు ఇబ్బంది కలుగుతోంది. వారికి ఆయా వార్డుల్లో పనిచేసే సిబ్బందే సేవలు చేయాల్సి వస్తోంది. ఆస్పత్రులు, వృద్ధాశ్రమాల్లో వృద్ధులను చేరుస్తున్న వారిలో కొందరు పేర్లు, సెల్‌ఫోన్ నంబర్లు రాస్తున్నారు. తర్వాత ఫోన్ చేస్తుంటే అందులో నిజాలు ఉండడం లేదని వైద్యులు, ఆశ్రమాల నిర్వాహకులు చెబుతున్నారు. ధర్మసాగర్ మండలం సాయిపేటకు చెందిన ఓ వృద్ధురాలిని కాజీపేట రైల్వే జంక్షన్ ప్రాంతంలో వదిలేసి వెళ్లి పోయారు. స్థానికులు చేరదీసి దగ్గరలోని సహృదయ అనాథ ఆశ్రమంలో చేర్పించారు. వివరాలు తెలుసుకుని కుమారులు, కుమార్తెలకు సమాచారం ఇచ్చినా వచ్చి తీసుకెళ్లని పరిస్థితి.



అనాథాశ్రమంలో మృతిచెందిన వ్యక్తికి అంత్యక్రియలు చేస్తున్న నిర్వాహకుడు చోటు

8నెలల్లో 58 మంది..

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి నేటివరకు ప్రభుత్వ ఆస్పత్రులు, రోడ్ల పక్కన, అనాథ ఆశ్రమాల్లో కలిపి 58మంది వరకు మృతిచెందారు. పత్రికలు, అధికారులు, ఆస్పత్రి వర్గాల ద్వారా సమాచారం తెలుసుకొని వారికి స్వచ్ఛంద సంస్థలు అంత్యక్రియలు నిర్వహించాయి. రహదారుల పక్కన గుర్తు తెలియని మృతదేహాలు కనిపిస్తే పోలీసులకు చుక్కలు కనిపిస్తాయి. వాటిని మార్చురీల్లో భద్రపర్చడం ఒక ఎత్తు అయితే.. గుర్తించడం వేచి ఉండి అంత్యక్రియలు సొంత ఖర్చులతో చేయడం తలకు మించిన భారంగా మారుతోంది.

అందరూ ఉన్నా దూరమే..



"మా ఆశ్రమంలో దశాబ్దన్నర కాలంలో 50మందికిపైగా వృద్ధులను మేమే అన్ని అయ్యి దహనం చేశాం. వీరికి అందరూ ఉన్న దహన సంస్కారాల కోసం ఎవరూ ముందుకు రారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో ఎన్నో ఆర్థిక కష్టాలు భరిస్తూ పది రోజుల వరకు అన్ని కార్యక్రమాలను పూర్తి చేస్తున్నాం. ఇప్పటికి మా ఆశ్రమంలోనే 85మంది వరకు అనాథలు ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో సగం మందికి అందరూ ఉంటారు, కానీ ఎవరూ లేరని చెబుతుంటారు.

\- ఎండీ యాకూబీ, సహృదయ అనాథ ఆశ్రమ నిర్వాహకురాలు

పోలీసులకు తలనొప్పే..



కాజీపేటలో రైల్వే జంక్షన్ ఉన్నందువల్ల అనాథల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆరోగ్యం సహకరించినంత కాలం భిక్షాటన చేస్తారు. ఆ తర్వాత పట్టించుకునే వారులేక మరణిస్తారు. ఇలాంటి కేసులు నెలకు ఐదారు వస్తాయి. వీరిని ఎంజీఎం మార్చురీకి తరలించడం, భద్రపర్చడం, బంధువుల కోసం ఎదురు చూడటం, సొంత ఖర్చులతో దహనం చేయడం తలకుమించిన భారంగా మారుతోంది.

\- వై.సుధాకర్ రెడ్డి, సీఐ, కాజీపేట

ఉత్తమ టీచర్ల ఎంపికలో పారదర్శకత ఏది?

- తొలి జాబితాను సవరించి రెండోజాబితా
- ఆయాసంఘాల ప్రాతినిధ్యంతో మూడోజాబితా కూడా..



విద్యారణ్యపురి : గతంలో ఎన్నడులేని విధంగా హనుమకొండ జిల్లాలో ఉత్తమ టీచర్ల ఎంపికపై విమర్శలు వెల్లువెత్తాయి. గురుపూజోత్సవం సందర్భంగా ఈనెల 4న మధ్యాహ్నం జిల్లాలో 48మందితో కూడిన ఎంపిక జాబితాను డీఈఓ ప్రకటించారు. ఎల్‌ఎఫ్‌హెచ్‌ఎంలు, ఎస్‌జీటీలకు తగిన విధంగా అవార్డుల్లో ఎంపిక చేయలేదనే ఆరోపణలు పలు ఉపాధ్యాయ సంఘాలు డీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో అదేరోజు రాత్రి కొంతమంది టీచర్ల పేర్లను తొలగించి మరికొందరిని చేర్చి 40మందితో ఉపాధ్యాయుల జాబితాను రాత్రి 11గంటల సమయంలో ప్రెస్ గ్రూప్, ఉపాధ్యాయ సంఘాల గ్రూప్‌ల్లో పోస్టు చేశారు. దీంతో అయోమయం నెలకొంది. ఒకసారి అవార్డుకు ఎంపికైనట్లు ప్రకటించి తొలగించడం ఆయా టీచర్లకు ఇబ్బందికరంగా మారిందని ఇది సరికాదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుక్రవారం డీఈఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పీఆర్‌టీయూ సంఘం జిల్లా బాధ్యులు.. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారని తెలిసింది. దీంతో ఎమ్మెల్యే కూడా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారని సమాచారం. దీంతో మొదటి జాబితా నుంచి తొలగించిన టీచర్ల పేర్లను యథావిధిగా నిర్ణయించారు. అయితే పీఆర్‌టీయూ బాధ్యులు మరికొన్ని పేర్లను ప్రతిపాదించారని సమాచారం. ఇక శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం ఉండగా పీఆర్‌టీయూ బాధ్యులు అక్కడికి విచ్చేశారు. ఉదయం 11 గంటలకు కలెక్టర్‌ను కలిసి తాము సూచించిన పలువురికి అవార్డుకు ఎంపిక చేయాలని కోరినట్లు సమాచారం. ఈవిషయంపై చర్చించిన తర్వాత 55మందితో కూడిన మూడో జాబితా వెల్లడించారు. ఆ తర్వాత మరో ఏడుగురి పేర్లను కూడా చేర్చాలని ఓ ఉపాధ్యాయ సంఘం కోరడంతో చివరికి 62మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేశారు. అందులో దరఖాస్తులు చేసిన వారందరితో పాటుగా నామినేటెడ్‌గా మరికొందరికి అవార్డులు అందజేశారు.

ఉమ్మడి జిల్లాకు 2,607.300 మెట్రిక్ టన్నుల యూరియా

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వే స్టేషన్‌లోని గూడ్స్ షెడ్‌కు ఐపీఎల్ కంపెనీకి చెందిన యూరియా శుక్రవారం చేరింది. కలెక్టర్ డాక్టర్ సత్యశారద, వ్యవసాయ అధికారి అనురాధ సూచనల ప్రకారం వరంగల్ జిల్లాకు 427.3, హనుమకొండకు 570, ములుగు 280, భూపాలపల్లి 400, జనగామకు 480, మహబూబాబాద్ 450 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించారు. దిగుమతి అయిన యూరియాను ఆయా జిల్లాల్లోని మండలాలకు చేరవేసేందుకు వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఐపీఎల్ కంపెనీకి చెందిన 2,607.300 మెట్రిక్ టన్నుల యూరియా రాగా.. వ్యవసాయ శాఖ అధికారులు విజ్ఞాన్, రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో జిల్లాలకు యూరియాను పంపిస్తున్నారు.



గూడ్స్ షెడ్‌లో దిగుమతి చేస్తున్న ఐపీఎల్ యూరియాను పరిశీలిస్తున్న ఏఓ రవీందర్‌రెడ్డి

నిమజ్జన ప్రదేశాల్లో వైద్యశిబిరాలు



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎంజీఎం/కమలాపూర్: గణపతి నిమజ్జనం చేసే 12 ప్రదేశాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, 108 వాహనాలు అందుబాటులో ఉంచినట్లు హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య తెలిపారు. ఈశిబిరాల వద్ద మూడు షిఫ్టులలో వైద్యాధికారి, సిబ్బందిని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. ఈమేరకు డీఎంహెచ్‌ఓ అప్పయ్య శుక్రవారం కటాక్షపూర్, పెద్దాపూర్ చెరువు, ప్రగతి సింగారెడ్డి బ్రిడ్జి, గుండ్ల సింగారం చెరువు, కమలాపూర్, హసన్‌పర్తి, సిద్ధేశ్వర గుండం, బంధం చెరువు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి వైద్య శిబిరాలను సందర్శించి సిబ్బంది సూచనలిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్వాతి, సాయికృష్ణ, నాగరాజు, శాంతిప్రియ, నవీన్, కవిత, రోహిత్, విజయరెడ్డి, ఇర్ఫాన్, సౌమ్య, సురేశ్, సాయిశ్రీ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' ఇటుకలకు వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో ఇరువురు దుర్మరణం
- చిట్యాల మండలం భావుసింగ్‌పల్లిలో విషాదం



నర్సయ్య మృతదేహం

భూపాలపల్లి అర్బన్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బాంబులగడ్డ జాతీయ ప్రధాన రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపక్కన ఆగి ఉన్న బైక్‌ను ఎదురుగా వస్తున్న టాటాఏస్ ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. చిట్యాల మండలం భావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సిమెంట్ ఇటుకలు కొనుగోలు చేసేందుకు వచ్చి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. సీఐ నరేష్‌కుమార్, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. భావుసింగ్‌పల్లికి చెందిన కొడపాక నర్సయ్య (50), కాల్వల సంజీవ్ (38) శుక్రవారం మధ్యాహ్నం భూపాలపల్లికి ద్విచక్ర వాహనంపై వచ్చి బాంబులగడ్డ సమీపంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న సిమెంట్ ఇటుకల ప్లాంట్‌కు వెళ్లి ధర మాట్లాడుకొని తిరిగి రోడ్డుకి చేరుకున్నారు. ఈక్రమంలో కాళేశ్వరం వెళ్లి భూపాలపల్లి వైపు వస్తున్న టాటాఏస్ వాహనం రోడ్డుకు ఎడమ వైపు నుంచి కుడి వైపునకు దూసుకు వచ్చింది. రోడ్డు పక్కనే ఆగి ఉన్న బైక్‌తో పాటు ఇరువురిని ఢీకొట్టింది. దీంతో వారికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. తలకు, శరీరం లోపల బలమైన గాయాలు కావడంతో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోలీసులు టాటాఏస్ వాహనం హనుమకొండ జిల్లా కమలాపూర్‌దిగా గుర్తించారు. మృతుడు నర్సయ్యకు కుమారుడు, భార్య, సంజీవ్‌కు ఇద్దరు కూతుళ్లు, భార్య ఉన్నారు. బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మార్చురీకి వెళ్లి పరామర్శించారు.



సంజీవ్ మృతదేహం

మద్యం మత్తులో డ్రైవర్..!

కమలాపూర్ గ్రామానికి చెందిన టాటాఏస్ వాహనంలో వినాయకుడి విగ్రహాన్ని కాళేశ్వరంలో నిమజ్జనం చేసి వస్తున్నారు. మార్గమధ్యలో మద్యం తాగినట్లు తెలిసింది. మద్యం మత్తులో డ్రైవర్ వాహనం నడుపుతుండగా అదుపు తప్పి ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే డ్రైవర్‌తో పాటు వాహనంలో ఉన్నవారు పరారయ్యారు. ప్రమాదానికి గురైన వాహనాలను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

- ఎవరైనా కొట్టి చంపారా అని అనుమానం?
- విచారణ చేపట్టిన పోలీసులు



రాంబాబు(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైతువేదిక సమీపంలో జాతీయ రహదారి పక్కన జరిగిన ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం ..కురవి మండలంలోని తాట్యా తండా గ్రామానికి చెందిన భూక్యా రాంబాబు (28) జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు.రాంబాబు ఓ వ్యాపారి వద్ద డ్రైవర్‌గా పని చేస్తుండగా, విధులకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి అతడి బావ బోడ వీరేందర్‌కు చెందిన కారు తీసుకుని గురువారం ఉదయం బయలుదేరి వెళ్లాడు. రాత్రి అయినా రాంబాబు ఇంటికి రాకపోవడంతో తండ్రి కిషన్ ఫోన్ చేసినా ఎలాంటి స్పందన లేదు. శుక్రవారం ఉదయం రైతువేదిక సమీపంలో కారులో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే డీఎస్పీ తిరుపతిరావు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా రాంబాబు కారులో రక్తపు మడుగులో మృతిచెంది కనిపించాడు. కారులో నుంచి రాంబాబు మృతదేహాన్ని పోలీసులు బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కారులోనే అనుమానాస్పదస్థితిలో మృతిచెంది ఉండగా పలు అనుమానాలకు తావిస్తోందని బంధువులు ఆరోపించారు. రాంబాబుకు వచ్చే నెలలో వివాహం జరుగనుందని, అంతలోనే అతడు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు సంఘటన స్థలంలో క్షుణ్ణంగా పరిశీలించి మృతుడి తండ్రి కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే రాంబాబును ఎవరైనా కొట్టి చంపి (హత్యచేసి) కారులో వదిలి వెళ్లారా, లేక గుండెపోటుతో మృతిచెంది ఉంటాడా అనే విషయం అనుమానాస్పదంగా మారింది. రాంబాబు తీసుకు వచ్చిన కారు గురువారం ఉదయం 10:30 గంటల నుంచి రైతువేదిక సమీపంలో జాతీయ రహదారి పక్కన ఆగి ఉందని స్థానికులు తెలుపగా పోలీసుల సమగ్ర విచారణలో నిజాలు వెల్లడి కానున్నాయి.



కారులో రాంబాబు మృతదేహం

ఉమ్మలేరులో పడి వ్యక్తి ..

బయ్యారం : మండలంలోని మిర్యాలపెంట సమీపంలో గల ఉమ్మలేరు వాగు ప్రవాహంలో పడి మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పందెం గ్రామానికి చెందిన బచ్చల రవి (38) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గంగారం మండలం పందెం గ్రామానికి చెందిన రవికి బయ్యారం మండలంలోని మిర్యాలపెంట సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. శుక్రవారం ఇంటినుంచి పొలం వద్దకు వెళ్లిన రవి సాయంత్రం అయిన ఇంటికి రాలేదు. దీంతో అతడి భార్య అన్నపూర్ణ రవి కోసం వెతుకుతున్న సమయంలో మిర్యాలపెంటకు చెందిన వారు ఉమ్మలేరులో రవి మృతి చెందిన విషయాన్ని తెలియజేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్.. ఆపై కిరాతకంగా హత్య



బాసిత్ (ఫైల్)

భూపాలపల్లి అర్బన్ : ఓ యువకుడిని కిడ్నాప్ చేసి..ఆపై కిరాతంగా హత్య చేసిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఎండీ బాసిత్ (20)ను, ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమీపంలో నిందితులు కాళ్లు, చేతులు కట్టేసి పెట్రోల్ పోసి కాల్చి హత్య చేశారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. బాసిత్ నాలుగు రోజుల క్రితం భూపాలపల్లి పట్టణంలో కిడ్నాప్‌నకు గురైనట్లు మృతుడి తల్లి సబియ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన బబ్లూ, ప్రశాంత్, కుషాల్, మరికొందరిపై అనుమానం వ్యక్తం చేసింది. దీంతో పోలీసులు విచారణ చేపడుతున్న క్రమంలో తాడ్వాయి సమీపంలో కాల్చిన మృతదేహం శుక్రవారం కనిపించింది. దీంతో సీఐ నరేష్‌కుమార్, ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడిపై ఇప్పటికి అనేక కేసులు నమోదై ఉన్నాయి. మద్యం, గంజాయి మత్తులో గతంలో జరిగిన గొడవల నేపథ్యంలో హత్య చేసినట్లు పట్టణంలో చర్చ జరుగుతోంది. ఈ ఘటనపై పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

బైక్ అదుపు తప్పి ప్రైవేట్ అధ్యాపకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు



శ్రీకాంత్ నాయక్ మృతదేహం

హసన్‌పర్తి : బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ ప్రైవేట్ అధ్యాపకుడు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కేయూ-కాజీపేట ప్రధాన రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ నాయక్ (25) నగరంలోని ఓ ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌లో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అదే ఇనిస్టిట్యూట్‌లో మహారాష్ట్రకు చెందిన రోహన్ కూడా అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. కాగా, గురువారం సహ అధ్యాపకుడి ఇంట్లో జరిగిన విందుకు ఇద్దరు హాజరై, తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. ఈక్రమంలో కేయూ-కాజీపేట ప్రధాన రోడ్డులోని తుల సీబార్ సమీపంలో ప్రధాన రహదారిపై బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో శ్రీకాంత్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన రోహన్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై నవీన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. బాధితకుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు రామప్ప ఆలయం మూసివేత



రామప్ప ఆలయంలోని రామలింగేశ్వరస్వామి

వెంకటాపురం (ఎం) : చంద్రగ్రహణం సందర్భంగా ఈనెల 7న (ఆదివారం) చారిత్రక రామప్ప ఆలయాన్ని మూసివేస్తున్నట్లు (ద్వార బంధనం) ఈఓ బిల్ల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న సోమవారం ఉదయం 6గంటలకు సంప్రోక్షణ అనంతరం రామలింగేశ్వరస్వామి దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపారు. భక్తులు, పర్యాటకులు సహకరించాలని కోరారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం సౌకర్యాలు

- వరుస క్రమంలో వనదేవతల గద్దెల మార్పుపై పరిశీలన
- మేడారంలో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మాస్టర్ ప్లాన్ ప్రకారం మేడారంలో వనదేవతల గద్దెల ప్రాంగణంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీష్ శుక్రవారం పరిశీలించారు. నూతన మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా భక్తుల సౌకర్యార్థం చేపట్టనున్న ఏర్పాట్లపై క్షుణ్ణంగా పర్యవేక్షించారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల వరుస క్రమంలో పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల ఏర్పాటు స్థలాన్ని, వనదేవతలను భక్తులు సులువుగా దర్శించుకునేలా ఈసారి కొత్త క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై పోలీసుల భద్రతతోపాటు వీఐపీ, వీవీఐపీల ఎంట్రి తదితర అంశాలపై చర్చించారు. ఈసారి నిర్వహించే మహాజాతర వరకు గద్దెల ప్రాంగణంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈఓ వీరస్వామి, డీఎస్పీ రవీందర్, డీఈ రమేశ్‌బాబు, పస్రా సీఐ దయాకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీష్ తదితరులు

రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుల ప్రదానం

కేయూ క్యాంపస్/ చిట్యాల : గురుపూజోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళా వేదికలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురికి సీఎం రేవంత్‌రెడ్డి అవార్డులు ప్రదానం చేయగా మిగిలిన వారికి విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అందజేశారు.



కేయూ క్యాంపస్: సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న హిందీ టీచర్ రాములు



విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్



ప్రొఫెసర్ ఎం.అరుణ



ప్రొఫెసర్ ప్రశాంతి



ఫిజికల్ డైరెక్టర్ సూకల లింగయ్య



ప్రొఫెసర్ ఎన్.మల్లయ్య



గిరిజనపీఠం పీఠాధిపతి వెంకన్న

పశువైద్య ఆరోగ్య నిర్వహణ భేష్

- నవాబుపేట సంతలో ఫిలిప్పీన్స్ వైద్యులు



లింగాలఘణపురం : తెలంగాణలో పశువైద్య ఆరోగ్య నిర్వహణ తీరు బాగుందని ఫిలిప్పీన్స్ దేశానికి చెందిన వైద్యులు ఫ్రాన్సిస్, వోవేల్ సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం జనగామ జిల్లా మండలంలోని నవాబుపేట సంతలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ రావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. పశువుల్లో వ్యాధుల నియంత్రణ, యాజమాన్య పద్ధతులు, రవాణాకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. భారతదేశ పశుమాంస ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు అఫ్జల్ అజీజ్, పశువైద్యులు దేవేందర్, భగవాన్ రెడ్డి, సాయికార్తీక్, పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిమార్గం చూపిన మహ్మద్ ప్రవక్త



ఖిలావరంగల్: అన్నదానం చేస్తున్న ఎంఏ జబ్బార్



కాజీపేట రూరల్: దర్గాలో పీఠాధిపతి ఖుస్రూపాషాను సన్మానిస్తున్న నాయకులు

- దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా
- ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

కాజీపేట రూరల్: శాంతి మార్గం చూపే మహ్మద్ ప్రవక్త దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా పీఠాధిపతి, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా అన్నారు. కాజీపేట దర్గా ప్రాంగణంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ-మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మక్కా నుంచి తీసుకొచ్చిన ప్రవక్త దుస్తులు, తల వెంట్రుకలను భక్తుల సందర్శనను ఖుస్రూపాషా ప్రారంభించారు. ఈసందర్భంగా ఖుస్రుపాషాను ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు 6 వేల మంది భక్తులు, ప్రజలకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తియార్ బియాబానీ, మాజీ కార్పొరేటర్ మహ్మద్ అబుబక్కర్, సయ్యద్ రజాలి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సర్వమానవాళిని కాపాడుతూ..

ఖిలా వరంగల్: సర్వ మానవాళిని కాపాడేందుకు ప్రవక్త శాంతి సందేశమిచ్చారని ఉర్సు దర్గా పీఠాధిపతి నవీద్‌బాబా, తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ జబ్బార్ అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుక్రవారం వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఈద్గా మైదానంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. భారీ జెండాను ఊరేగించి ఈద్గా మసీద్‌లో ప్రతిష్ఠించారు. మతాలకు అతీతంగా వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అనంతరం మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉబేద్ బాబా, ఎండీ చాంద్‌పాషా, మహ్మద్ ముగ్దుం తదితరులు పాల్గొన్నారు.